క్లుప్తంగా

నేడు మండల సర్వ సభ్య సమావేశం

వల్లూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అబ్బిరెడ్డి మల్లేశ్వరి అధ్యక్షతన మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ జుబేద ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో పలు శాఖలపై సమీక్ష నిర్వహించి చర్చిస్తామని పేర్కొన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి స్థాయి నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆమె కోరారు.

స్పందన సమస్యలను పరిష్కరించాలి

– తహసీల్దార్ పఠాన్ అలీఖాన్



స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ పఠాన్ అలీఖాన్

చెన్నూరు : స్పందన కార్యక్రమానికి వచ్చే సమస్యలను వలంటీర్లు గుర్తించి సచివాలయ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటిని వెంటనే పరిష్కరించేలా చూడాలని తహసీల్దార్ పఠాన్ అలీ ఖాన్, ఎంపీడీఓ గంగనపల్లి సురేష్ బాబు తెలిపారు. సోమవారం వారు చెన్నూరు పాత బస్టాండ్ లోని గ్రామ సచివాలయం–2 లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు ఏవైనా అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించాలని, ఒకవేళ మీకు సాధ్యపడని సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సచివాలయ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గంగాధర్, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవి, ఉపాధి హామీ సుధారాణి, అంగన్వాడీ సూపర్‌వైజర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గన్నగారిపల్లె వాసికి డాక్టరేట్ ప్రదానం



వడ్డెమాని గురుప్రతాప్‌రెడ్డి

వేముల : మండలంలోని దుగ్గన్నగారిపల్లె గ్రామానికి చెందిన వడ్డెమాని గురుప్రతాప్‌రెడ్డికి డాక్టరేట్ లభించింది. ఈయన వరంగల్ నిట్ కళాశాలకు చెందిన సివిల్ డిపార్ట్‌మెంట్ ఫ్యామిలీ డాక్టర్ తేజస్వి, ప్రొఫెసర్ రతీష్‌కుమార్ పర్యవేక్షణలో 'కండిషన్ అసెస్‌మెంట్ అండ్ సర్వీస్ లైఫ్ ఎస్టిమేషన్ ఆఫ్ టేరియర్టింగ్ కాంక్రీట్ యూసింగ్ ఇమేజ్ బెస్ట్ అనాలసిస్' అనే అంశంపై 13 పరిశోధనా పత్రాలు ప్రచురించడం విశేషం.

సేవా దృక్పథం అలవరుచుకోవాలి



రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ, తదితరులు

పులివెందుల రూరల్ : ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని జేఎన్‌టీయూ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ శేష మహేశ్వరమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆసుపత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



ఏపీ గ్రామ రెవెన్యూ ఉద్యోగుల సంఘం సెక్రటరీని సన్మానిస్తున్న తహసీల్దార్

జమ్మలమడుగు: ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా విజయ చైతన్య ఏకగ్రీవంగా ఎన్నికై నందుకు రెవెన్యూ ఉద్యోగుల సంఘం సన్మానం కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గురప్ప ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం విజయ్ చైతన్య మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ అధికారుల సమస్యల పరిష్కారం కోసం రాజీ లేని పోరాటం చేస్తామన్నారు. తనపై నమ్మకంపై ఎన్నుకున్నందుకు రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీ వేణుగోపాల్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భీమన్న పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

వేముల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కోగటం వెంకట బయపురెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గొల్లలగూడూరులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లోని ప్రజలకు అన్ని రకాల సేవలు అందిస్తున్నారన్నారు. అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉండకూడదనే సదాశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. జగనన్న సురక్ష ద్వారా 11రకాల సేవలు ఎలాంటి సేవా రుసుము లేకుండానే ఉచితంగా సేవలు అందిస్తున్నారన్నారు. సర్పంచ్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు మహేష్‌రెడ్డి, చంద్ర ఓబుళరెడ్డి, ఈసీ మహేష్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హాఫీజ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని గుంతబజార్ వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై జగనన్న సురక్ష కార్యక్రమం గురించి వివరించడంతో పాటు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అలాగే గరండాల్ వంక తీరం వెంట నివసిస్తున్న ప్రజలు వారి ఇంటి మురుగునీటి కనెక్షన్‌ను ఇంటి ముందు గల యూజీడీ చాంబర్‌కు కనెక్షన్ ఇచ్చుకోవాలన్నారు. అనంతరం జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలకు సంబంధించి 783 మందికి కుల, ఆదాయ, వివాహ, జనన తదితర ధృవీకరణ పత్రాలను ఉచితంగా అందించారు. కౌన్సిలర్లు పుష్పావతి, పార్నపల్లె కిశోర్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి



పులివెందులలో లబ్ధిదారులకు ఉచితంగా సర్టిఫికెట్లను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు



వేముల.. గొల్లలగూడూరులో లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న మండల ఇన్‌చార్జి , జెడ్పీటీసీ, తదితరులు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం): జగనన్న సురక్షతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మైలవరం మండలం ఎంపీడీఓ వై. రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలపరిధిలోని వేపరాల గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడారు. అన్ని అర్హతలు కలిగి పథకాలు అందని ప్రజలను గుర్తించి పథకాలు మంజూరు చేయాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కుమారుస్వామి, తహశీల్దార్ తిరుపతయ్య, ఎంపీడీఓ శ్రీహరి, డిప్యూటి తహశీల్దార్ రూపేష్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ద్వారా సమస్యల పరిష్కారం

సింహాద్రిపురం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారంతోపాటు ఉచిత సర్టిఫికెట్లను అందిస్తున్నామని మండల స్పెషలాఫీసర్ నాగలింగాచారి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హిమకుంట్ల గ్రామ సచివాలయంలో నెడ్‌క్యాప్ రాష్ట్ర డైరెక్టర్ కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్పెషలాఫీసర్ నాగలింగాచారి హాజరై మాట్లాడారు. ఎంపీటీసీ మనోహర్ రెడ్డి, ఉప సర్పంచ్ కృపాకర్‌రెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి,డీటీ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పేద ప్రజలకు వరం

లింగాల : జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరం లాంటిదని వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన లింగాల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సురేంద్రనాథ్ లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగభూషణ్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, జూలు బాకర్, చిన్నకుడాల సర్పంచ్ నాగేంద్రా రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సింహాద్రిపురం.. ప్రజలకు సర్టిఫికెట్లను అందిస్తున్న మండల స్పెషలాఫీసర్, తదితరులు



మైలవరం.. లబ్ధిదారులకు సర్టిఫికేట్లను అందజేస్తున్న అధికారులు



లింగాల.. లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు

ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి



లబ్ధిదారులకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు: ప్రజలకు మేలు చేయాలనే సదుద్దేశంతో జగనన్న సురక్షను ప్రవేశపెట్టామని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 9,10 వార్డులైన బీసీ కాలనీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగనన్న సురక్ష గురించి వివరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, వార్డు కౌన్సిలర్ సలోమి కోఆప్షన్ సభ్యుడు లక్షుమయ్య, మున్సిపల్ కమీషనర్ జి.వెంకట్రామిరెడ్డి డీటి వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ వందశాతం మేలు జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎర్రగుంట్ల పట్టణంలోని 8,9 వార్డు కౌన్సిలర్లు డి వెంకటలక్షుమ్మ, డి లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జగనన్న సురక్షలో పాల్గొని పత్రాలు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు సాయం

అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఓబులరెడ్డి నరసింహారెడ్డి (జ్వాలా)కి ఎమ్మెల్యే రూ.20 వేలు నగదు అందజేశారు. అలాగే పుష్పగిరి కాలనీలో పలు సమస్యలను ప్రజలు తెలియజేయగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు దాసరి లక్ష్మీదేవి, దేరంగుల వెంకట లక్షుమ్మ, కో–ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణరెడ్డి, కమిషనర్ పి జగన్నాథ్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాట్ల పనులు పరిశీలన



వైఎస్సార్ విగ్రహ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని కడప రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న మున్సిపల్ భవనం ఆవరణలో దివంగత సీఎం డాక్టరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహ ఏర్పాట్లు పనులు త్వరగా పూర్తి చేయాలని జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం విగ్రహ ఏర్పాటు పనులతో పాటు మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యర్రగుంట్ల వాసి, సాక్షి ఫైనాన్స్ డైరెక్టర్ యర్రం రెడ్డి ఈశ్వరప్రసాద్‌రెడ్డి దాతృత్వంతో వైఎస్సార్ విగ్రహాంను అత్యంత సుందరీకరణంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విగ్రహం ఏర్పాటుకు ఫౌండేషన్ అయిందన్నారు. చుట్టు ప్రహరీతో పాటు గ్రీనరీ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెలలోనే విగ్రహ ప్రారంభోత్సవంతోపాటు, మున్సిపల్ భవనం, పబ్లిక్ హెల్త్ భవనంను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డితో పాటు కో–ఆప్షన్ సభ్యులు డి సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్ ఎరిలకరెడ్డి, యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ నాయకులు డి గంగాక్రిష్టారెడ్డి, కేవి సుబ్బారెడ్డి, రాజారెడ్డి, మాజీ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ వై విశ్వభార్గవరెడ్డి, ఇస్మాయిల్ కాంట్రాక్టర్ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

భద్రాచలం రామస్వామికి రామకోటి పుస్తకాలు



రామకోటి పుస్తకాలు ప్యాక్ చేస్తున్న మహిళలు

పోరుమామిళ్ల : రెండు నెలలుగా భక్తులు రాసిన రామకోటి పుస్తకాలు ఈ నెల 20న భద్రాచలం తీసుకెళ్లి రాములోరి సన్నిధిలో ఇస్తామని పుస్తక ప్రచురణకర్త శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా నాగేంద్రరెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి, సురేష్, బాలుడుల మిత్రబృందంతో రామకోటి పుస్తకాలు ప్రచురించి భక్తులకు అందించామన్నారు. భక్తులు రామకోటి రాయడం పూర్తయిందని, సోమవారం ఆ పుస్తకాలను శుభ్రపరచి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి గుడిలో కాషాయవస్త్రంలో మహిళలు మంజుల, చంద్రమ్మ, వీరమ్మ, సుబ్బమ్మ, సుబ్బలక్షుమ్మ ప్యాక్ చేశారన్నారు. ఈ పుస్తకాలను భద్రాచల ఆలయంలో అప్పగిస్తామన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు సురక్షితం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుస్మిత



గర్భిణులకు సూచనలిస్తున్న డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు

ప్రొద్దుటూరు క్రైం : ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పు కావడం ఎంతో సురక్షితమని డాక్టర్ హనీఫ్‌బాబా తెలిపారు. కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం గర్భిణులకు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ సుస్మిత వైద్య పరీక్షలు నిర్వహించారు. హై రిస్కూ ఉన్న వారికి సురక్షిత కాన్పు కోసం పలు సూచనలు ఇచ్చారు. బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కృష్ణమ్మ, హెచ్‌ఈ శోభారాణి, సూపర్‌వైజర్ బీపీ వరప్రసాద్, ఫార్మసిస్టు శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, స్టాఫ్ నర్సులు, పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

బి.కోడూరు : గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వినీత్‌కుమార్‌రాజు తెలిపారు. సోమవారం పీహెచ్‌సీలో వైద్యాధికారి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా 10 మంది గర్భిణులు, ఐదుగురు బాలింతలకు రక్తపరీక్షలు, గ్రూప్ పరీక్షలు, ఎత్తు, బరువు, హెచ్‌ఐవీ పరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకొని వైద్యుల పర్యవేక్షణలో ఉండాలని తెలిపారు. పోషకాలు కలిగిన ఆకుకూరలు, ఖనిజ లవణాలు, క్రొవ్వు పదార్థాలు, పిండి పదార్థాలు, మాంసకృత్తులు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో కాన్పు చేయించుకోవాలని తెలిపారు. బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి, ఆరోగ్య పర్యవేక్షకులు విజయలక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ చంద్రశేఖర్, పబ్లిక్ హెల్త్‌నర్సు పుష్పాంజలి, వైద్య సిబ్బంది రామచంద్ర, రాజమ్మ, రామతీర్థం, విజయలక్ష్మి, వేదవతి, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులు

కడప ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ఓసీ పేద విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కోర్సులు తక్కువ ఖర్చుతో అందించేందుకు ఓసీ సంఘం ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని ఓసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కందనూరు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. సాఫ్ట్‌వేర్ కోర్సులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సబ్సిడీతో అందుబాటులోకి తెచ్చేందుకు కేవీఎం సొల్యూషన్స్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. సోమవారం బెంగుళూరుకు చెందిన కేవీఎం టెక్ సొల్యూషన్స్ ప్రతినిధులు భాస్కర్, సుదర్శన్, సుబ్బారెడ్డి, గిరీష్‌లతో సమావేశమై చర్చించినట్లు తెలిపారు. లెనెక్స్, అడ్మిన్, అజూర్, ఆటోమేషన్ టెస్టింగ్, జావా, ఎస్‌ఏపీ, అబాస్ కోర్సులకు మార్కెట్‌లో ఉన్న విలువ కన్నా 70 శాతం సబ్సిడీతో విద్యార్థులకు అందిస్తామని ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కోర్సులలో చేరాలనుకునే ఓసీ సంఘం విద్యార్థులు 9491797624కు వివరాలను పంపి నమోదు చేసుకోవాలని తెలిపారు.

దుమ్మును నివారించండి

ఎర్రగుంట్ల : స్థానిక ఐసీఎల్ ఫ్యాక్టరీ వల్ల వస్తున్న దుమ్ముతో 17 వార్డు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని, దుమ్మును రాకుండా నివారించడానికి చర్యలు చేపట్టాలని 17వ వార్డు కౌన్సిలర్ జీ ఎరికల్‌రెడ్డి కోరారు. సోమవారం స్పందనలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఫ్యాక్టరీ వల్ల వస్తున్న దుమ్ముతో 15,16,17 వార్డు ప్రజలందరు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

అనుమతిలేని మందులు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ, ఏఓ

ముద్దనూరు: అనుమతిలేని పురుగుమందులు, ఎరువులను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భూసంరక్షణ విభాగం ఏడీఏ అనిత హెచ్చరించారు.సోమవారం స్థానిక ఏఓ వెంకట కృష్ణారెడ్డితో కలిసి ఏడీఏ పురుగుమందుల, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉప్పలూరులో, ముద్దనూరులో సరైన పత్రాలు లేకుండా విక్రయిస్తున్న రూ.46వేలు, రూ.1లక్షా6వేల విలువ చేసే ఎరువుల ఉత్పత్తులను నిలిపివేసినట్లు ఏడీఏ తెలిపారు. ఈ తనిఖీలో రికార్డులు,లైసెన్స్ కాలపరిమితి, బిల్లులను వారు పరిశీలించారు.

బాలుడికి రక్తదానం

పోరుమామిళ్ల : కలసపాడు మండలం తెల్లపాడు గ్రామానికి చెందిన చక్రవర్తి (11) అను బాలుడు అనారోగ్యంతో పోరుమామిళ్లలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరాడు. పరీక్షించిన వైద్యులు అతనికి 3 శాతం రక్తం మాత్రమే ఉందని, ఏ పాజిటివ్ రక్తాం కావాలని చెప్పారు. సోమవారం బాలుని బంధువులు రక్తం కోసం ప్రయత్నించి లభించకపోవడంతో రైట్ హ్యాండ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నాయబ్‌రసూల్‌ను కలిశారు. ఆయనది అదే గ్రూపు రక్తం కావడంతో రక్తదానం చేశారు.

అంగన్‌వాడీల ధర్నా

ప్రొద్దుటూరు : అంగన్‌వాడీ కేంద్రాలను విభజించకుండా యథావిధిగా కొనసాగించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు ఎస్.మంజుల తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ధర్నాలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను రీ ఆర్గనైజేషన్ చేయడం ద్వారా అనేక రకాల సమస్యలు వస్తున్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా విలీనం చేసిన సెక్టార్లను యథావిధిగా పరగణించారని, ప్రొద్దుటూరులో మాత్రమే రెండు సెక్టార్లను విచ్ఛిన్నం చేసి విలీనం చేశారన్నారు.

సీపీఐ బస్సు జాతాను జయప్రదం చేయండి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 16 నుంచి చేపట్టనున్న సీపీఐ బస్సు జాతాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. సోమవారం ఆయన సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ విధానాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ఉద్యోగ వాటాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని నిలదీయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.రామయ్య, ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్ పాల్గొన్నారు.

పంటల బీమాతో రైతులకు ఊరట

మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నారాయణమ్మ



మాట్లాడుతున్న ఏఓ మధుసూదన్‌రెడ్డి

తొండూరు : గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి దెబ్బతిన్న రైతులకు పంటల బీమా మంజూరు చేశారని.. దీంతో చాలామంది రైతులకు ఊరట కలిగిందని ఎంపీపీ నారాయణమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీపీ నారాయణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అభివృద్ధి చేస్తున్నారన్నారు. అలాగే మండల వ్యవసాయాధికారి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఎప్పుడూ లేని విధంగా ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులకు 5రకాల పంటలకు పంటల బీమా మంజూరు చేయడంపై ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో దాదాపు 7900మంది రైతులకుగానూ రూ.4కోట్ల మేర పంటల బీమా మంజూరైందని వెల్లడించారు. అలాగే అర్హులై ఉండి పంటల బీమా అందని రైతులు ఉంటే తమ దృష్టికి వస్తే సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకుడు బండి రామమునిరెడ్డి, తాలుకా కార్యదర్శి దశరథరామిరెడ్డి, మండల రైతు సంఘం నాయకులు వెంకట్రామిరెడ్డి, తహసీల్దార్ బాలనరసింహులు, ఎంపీడీఓ విష్ణుప్రసాద్, పీఆర్ ఇంజనీర్ లక్ష్మినారాయణరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీలు ఓబులేసు, విజయ్‌శంకర్, కో–ఆప్సన్ మెంబర్ ప్రకాష్ రావు, సర్పంచ్‌లు గురుమోహన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గంగయ్య, గంగిరెడ్డి, రజియా, రామసుబ్బారెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం లక్ష్యం

చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి



సిటీ ఫారెస్ట్ రాణితోపును పరిశీలిస్తున్న చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలు చెప్పుకునే విధంగా పులివెందులలో ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తిరుపతిలో కూడా పులివెందుల తరహాలోనే అభివృద్ధి చేసే విధంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న సిటీ ఫారెస్ట్ రాణి తోపు, గరండాల్ వంకను ఆయన పరిశీలించారు. తుడా బీసీ హరికృష్ణ, సెక్రటరీ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అటవీ సంపద పరిరక్షణ అందరి బాధ్యత

–రేంజర్ కళావతి



శ్రీనిత్యపూజ స్వామి కోన అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రేంజర్ కళావతి

సిద్దవటం: అటవీ సంపద అయిన ఎర్రచందనం తరలి పోకుండా కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని రేంజర్ కళావతి తెలిపారు. సిద్దవటం రేంజిలోని పంచలింగాలు, శ్రీ నిత్యపూజస్వామి కోన అటవీ ప్రాంతాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇక్కడ కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ఆలయ సిబ్బందికి సూచించారు. పంచలింగాల వద్ద వన్యప్రాణులను దృష్టిలో పెట్టుకొని అపరిశుభ్రత లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆలయ అర్చకులు సుబ్రమణ్యంశర్మ, చైర్మన్ కొండారెడ్డి ఆలయ సంప్రదాయాలతో రేంజర్‌కు స్వాగతం పలికారు. భక్తుల సౌకర్యాలపై ఆమె ఆలయ చైర్మన్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ఓబులేసు, బీటు అధికారులు, ఏబీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు

రాయచోటిటౌన్ : రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు కూడా అభిషేకాలు నిర్వహించి రంగురంగుల పూలు, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించి పల్లకీలో ఉంచి మాఢవీధులలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవ ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు విజయ, ఆలయ ఈఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

భక్తిశ్రద్ధలతో కాల భైరవాష్టమి పూజలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని ఎంఎస్ కొట్టాల గ్రామంలో సోమవారం శ్రీ ఇష్టకామ్యార్థ కాల భైరవస్వామి ఆలయంలో కాలభైరవాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీధర్ శర్మ తొలుత మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. అనంతరం స్వామికి విశేష అలంకారం చేశారు. ఆలయం వెలుపల భక్తులు ప్రత్యేక పూజలను సామూహికంగా నిర్వహించారు. అనంతరం భక్తులు కుష్మాండ దీపాలతో స్వామికి హారతులు పట్టారు. బాలాజీరావు, కార్తీక్‌రెడ్డి పూజలను పర్యవేక్షించారు.